క్లుప్తంగా

నీతి కథల ద్వారా జీవిత పాఠాలు

అంబాజీపేట: జీవితంలో నేర్వని పాఠాలను నీతి కథల ద్వారా తెలుసుకోవచ్చని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పంచతంత్ర కథలు, నైతిక విలువల గల కథలు చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు గ్రంథాలయాలు వేదికలుగా మారాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజు గ్రంథాలయాలకు పంపాలన్నారు. పుస్తక పఠనాసక్తిని పెంచడమే గ్రంథాలయాల లక్ష్యమన్నారు. తొలుత నీతి కథలు వివరించారు. పుస్తక సమీక్షలు రాశారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సత్కారం



బదిలీ అయిన సురేష్ కుమార్‌ను సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

మలికిపురం: స్థానిక ఎస్‌బీఐ అంతర్వేది రోడ్ శాఖ మేనేజర్ డి.సురేష్‌బాబు విశాఖ పట్నం బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా స్థానిక బ్రాంచ్ సిబ్బంది సురేష్‌బాబును సన్మానించారు. అలాగే బ్యాంకు నూతన మేనేజర్‌గా మెహర్‌సాయి దత్త బాధ్యతలు స్వీకరించారు. కొత్త మేనేజర్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆదివారం బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అకౌంటెంట్ రామ్‌ప్రసాద్, ఫణి సూర్యకుమార్, హెచ్ ఎల్‌సీలు నల్లి శివకుమార్, నాగరాజు, సంకర మురళి తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

అంబాజీపేట: మాచవరం శివాలయం సమీపాన ఇసుకపూడి వెళ్లే ప్రధాన రహదారిలో గత మూడు రోజులుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఇళ్లలోని ఫ్యాన్లు తిరగడం లేదని, విద్యుత్ బల్బులు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కపోతకు గురవుతున్న వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు లోవోల్టేజీ సమస్య వల్ల రేయిబవళ్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫారం వల్ల లోవోల్టేజ్ సమస్య వస్తుందని సంబంధిత లైన్‌మన్‌కు తెలియపరచినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు బహిరంగంగా విమర్శించారు. తక్షణమే లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కోరారు. లోవోల్టేజీ సమస్యపై విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కరించే చర్యలు తీసుకుంటామని స్థానికులకు ఎమ్మెల్యే వివరించారు.

లివర్ వ్యాధిగ్రస్తుడికి సాయం



సూరిబాబుకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన సూరిబాబు కొంత కాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి నెలా లివర్ క్లీనింగ్ చేయించుకోవడానికి, మందులకు, వైద్యం నిమిత్తం సుమారు రూ.ఐదు వేల వరకూ ఖర్చు అవుతుంది. పేదరికంతో ఇబ్బంది పడుతున్న సూరిబాబు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరగా ఆదివారం సేవా సమితి సభ్యులు అతని ఇంటికి వెళ్లి రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంగా అందజేశారు.

సీఏ సర్టిఫికెట్ స్వీకరించిన నాగలక్ష్మి



హైదరాబాద్‌లో సీఏ సర్టిఫికెట్ స్వీకరిస్తున్న నాగలక్ష్మి

ఆలమూరు: కష్టపడి, ఇష్టపడి చదువుకుని సాధించిన ప్రతిష్టాత్మక చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) సర్టిఫికెట్‌ను మండలం కేంద్రం ఆలమూరుకు చెందిన నిమ్మకాయల నాగలక్ష్మి స్వీకరించారు. అత్యుత్తమమైన ప్రతిభతో సీఏను పూర్తి చేసిన నాగలక్ష్మికి శనివారం రాత్రి హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఇండియా నిర్వహించిన సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో తల్లిదండ్రులు సాయిరామ్, దుర్గాలక్ష్మి సమక్షంలో నాగలక్ష్మికి అందజేశారు. సీఏగా బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మికి పలువురు అభినందనలు తెలియజేశారు. తండ్రి సాయిరామ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

ఇకపై ఇంటికే పోషక ఆహారం

- గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- అంగన్‌వాడీల ద్వారా జూలై 1 నుంచి అమలుకు చర్యలు
- నెలలో రెండు విడతలుగా అందించేందుకు ఏర్పాట్లు



కొత్తపేటలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ శారద (ఫైల్)

కొత్తపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల కింద పోషకాహారాన్ని పంపిణీ చేస్తోంది. దీనివల్ల శిశుమరణాల రేటు తగ్గింది. చిన్నారులు, గర్భిణులు ఆరోగ్యం మెరుగుపడింది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పోషకాహారం (భోజనం) తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతుండగా మరికొందరు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వం వచ్చే జూలై 1 వ తేదీ నుంచి లబ్ధిదారులకు ఇంటి వద్దకే తీసుకువెళ్లి పోషకాహార కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంది.

లబ్ధిదారులు కేంద్రాలకు రాకపోవడంతో..

కరోనా సమయంలో రెండేళ్ల పాటు టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) పేరుతో లబ్ధిదారులకు సరుకులు ఇంటికే తీసుకువెళ్లి అందజేశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మళ్లీ తెరిచారు. గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న సరుకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు సక్రమంగా సద్వినియోగం కావడంలేదనే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది జూన్ 1 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వంటలు చేసి వేడిగా భోజనం వడ్డించడం ప్రారంభించారు. ఈ విధంగా భోజనం అమలు జరుగుతున్నా పూర్తి స్థాయిలో లబ్ధిదారులు కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపకపోవడంతో పాటు నెలలు నిండటం, అనారోగ్య సమస్యలు, చిన్నారుల సంరక్షణ వంటి కారణాలతో కేంద్రాలకు రాలేమని చెప్పడంతో అటువంటి వారికి కొంత వెసులుబాటు కల్పించి, పోషకాహారం ఇంటికి తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పించారు. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, కేంద్రాల్లోనే భోజనం పెట్టాలా? లేదా పోషకాహారం కిట్లు ఇంటికే ఇవ్వాలా? అనే అంశంపై సర్వే నిర్వహించింది. అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఇంటికే ఇవ్వాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వారి అభిప్రాయానికి ఆమోదముద్ర వేసి సరుకులు ఇంటికే తీసుకువెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు నిర్దేశిత పరిమాణంలో సరుకులు ప్యాక్ చేసి ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించారు. నెలలో రెండు సార్లు పోషకాహారం కిట్లు అందించేలా చర్యలు చేపట్టారు.

గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పోషణ కిట్లు ఇలా..

సరుకు	పరిమాణం
అటుకులు	1 కేజీ
రాగిపిండి	2 కేజీలు
కందిపప్పు	1 కేజీ
బియ్యం	3 కేజీలు
బెల్లం	250 గ్రాములు
వేరుశెనగచిక్కీలు	250 గ్రాములు
ఎండు ఖర్జూరం	250 గ్రాములు
నూనె	450 గ్రాములు
కోడిగుడ్లు	25
పాలు	5 లీటర్లు

క్లస్టర్‌లో లబ్ధిదారులు

నియోజకవర్గం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
కొత్తపేట	231	1497	1802
పి.గన్నవరం	198	1058	1179
రాజోలు	215	1167	1290
మొత్తం	644	3722	4271

లబ్ధిదారుల అభిప్రాయం మేరకే నిర్ణయం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం లబ్ధిదారుల అభిప్రాయం మేరకు ప్రభుత్వం వారి ఇంటికే అందించాలని నిర్ణయం తీసుకుంది. జూలై నెల నుంచి సరుకుల కిట్ల రూపంలో లబ్ధిదారుల ఇళ్లకే తీసుకువెళ్లి అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5 వ తేదీ లోగా మొదటి విడతగా సరుకులన్నింటితో పాటు 15 రోజులకు సరిపడా గుడ్లు, పాలు ఇస్తారు. 16 నుంచి మిగిలిన గుడ్లు, పాలు అందిస్తారు.

– పి.శారద, సీడీపీఓ, కొత్తపేట ఐసీడీఎస్

రారెత్తిస్తున్న రోహిణి..



గంగలకుర్రులో మండుటెండలో వెళుతున్న కూలీలు

అంబాజీపేట: రోహిణీ కార్తె ప్రతాపంతో వేసవి ఉష్ణోగ్రతలు నిప్పుల కొలిమిగా మారాయి. శని, ఆదివారం ఎండ తాకిడి, వేడి గాలులకు ప్రజలు బయటకు రావడానికే హడలిపోయారు. గత మూడు రోజుల నుంచి రోహిణీ ప్రభావం కనబడుతుండడంతో భయపడిపోతున్నారు. ఎండ వేడిమికి తాళలేక వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ వచ్చింది. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యమయ్యాయి. దుకాణాలన్నీ మూత పడ్డాయి. దాదాపుగా గత రెండు రోజుల నుంచి 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బస్సులు, లారీల డ్రైవర్లు నానా ఇబ్బందులు పడ్డారు. ముఖానికి జేబు రుమాళ్లు, తడిగుడ్డలు కట్టుకొని ఎండ తీవ్రత తగలకుండా ప్రయత్నాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలయ్యే సరికి అంబాజీపేట, పుల్లేటికుర్రు, ముంగండ, మాచవరం, కె.పెదపూడి, ముక్కామల రహదారులు నిర్మానుష్యంగా మారాయి, సెంటర్‌లోని దుకాణాలన్నీ మూసివేశారు. వడగాడ్పులకు జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. భానుడి ప్రతాపానికి పశువులు అల్లాడుతున్నాయి. ఎక్కడ నీడ కనబడిన అక్కడ సేదతీరుతున్నాయి.

ప్రతి గడపలో చిరునవ్వు...



గంగలకుర్రులో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రతి గడపలో కుటుంబ సభ్యులందరి చిరునవ్వు, సంతృప్తి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజాదరణ పొందారని ఎమ్మెల్యే, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే బాధ్యతాయుతంగా గడపగడపకు కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలు తారతమ్యం లేకుండా అందజేయడమే పార్టీ అజెండా అని అన్నారు. నాలుగేళ్లుగా సీఎం ప్రణాళిక, ఆలోచనా విధానం, ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ప్రజలందరికీ భరోసా కల్పించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి పండు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, దొమ్మేటి నాగన్న, పితాని కాశీ, బొక్కా వీవీ సత్యనారాయణ, విత్తనాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, ఉపాధ్యాయుడు చింతా శ్యామ్‌కుమార్ తన స్వగృహం వద్ద గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న చదువంటే నాకిష్టం అనే కార్యక్రమంను ప్రతిరోజు నిర్వహిస్తూ తన పాఠశాల చిన్నారులతో పాటు గ్రామంలో ఉన్న చిన్నారులకు సుమారు 500 పుస్తకాలు అందుబాటులో ఉంచి కథలు చెప్పడం, రాయడం, డ్యాన్స్ వంటి శిక్షణ ఇస్తున్నారు. ఆదివారం చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ గల చిన్నారులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి

ఆలమూరు: మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలు మండలంలో వివిధ గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. మండల టీడీపీ శాఖ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి నేతృత్వంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. గుమ్మిలేరులో గ్రామ తెలుగు యువత ఆధ్వర్యంలో వందకేజీల కేక్ కట్ చేశారు. నవాబుపేట, చింతలూరు, మడికి, జొన్నాడ, గుమ్మిలేరు, చొప్పెల్ల తదితర గ్రామాల్లో నెలకొల్పబడిన ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయా గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఎన్టీఆర్ జయంతిని అంబాజీపేట పోలీస్ స్టేషన్ వద్ద పార్టీ మండల కార్యదర్శి గూడాల ఫణి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట, పుల్లేటికుర్రులో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు దాసరి వీవీ సత్యనారాయణ, పబ్బినీడి రాంబాబులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నందంపూడిలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మాజీ సీఎం ఎన్టీఆర్ శత జయంతిని ఆదివారం కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, దర్నాల రామకృష్ణ, బండారు వెంకటసత్తిబాబు, కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీకి రూ.1.38 లక్షల ఆదాయం



అప్పనపల్లి బాలబాలాజీ స్వామి



వాడపల్లిలో స్వామికి అష్టోత్తర పూజలు



ర్యాలిలో దాతకు స్వామి చిత్రపటం ఇస్తున్న సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.38 లక్షల ఆదాయం వచ్చింది. దర్శనం టికెట్ల విక్రయం, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.89,295 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.49,637 చెల్లించారు. 2,186 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 1,674 మంది స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. హైదరాబాద్‌కు చెందిన గంటి వీరభాస్కరశర్మ, సుభద్ర దంపతులు స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.13,060 విరాళం ఇచ్చారు. ఏటా ఆగస్టు 15న తమ పెళ్లి రోజు సందర్భంగా అన్నదానం చేసే విధంగా దాతలు ఈ విరాళం అందించారు. దాత కుటుంబానికి ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు. ఆలయ ఈఓ డి.శ్రీరామ వరప్రసాదరావు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి ఆదివారం ఆలయ ఆవరణలో అష్టోత్తర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు ఈ పూజలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠకు విరాళం

పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠకు హైదరాబాద్‌కు చెందిన నల్లాని చక్రవర్తుల విజయకుమార్ రూ.15,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, బాణాసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండువగా జరిపించారు. అమ్మవారికి సోమవారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే సాయం



క్యాన్సర్ బాధిత చిన్నారికి సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తన వంతుగా రూ.10 వేలు సాయం అందజేశారు. కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన సవరపు లావణ్య, రాము దంపతుల కుమార్తె అనుపమశ్రీ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. వైద్యం నిమిత్తం ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ఇళ్ల శ్రీరాములు ద్వారా ఆదివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆశ్రయించారు. తక్షణం వైద్య ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు అందజేయడంతో పాటు జిల్లా ఆరోగ్యశ్రీ అధికారులతో మాట్లాడి చిన్నారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఎంసీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, వాడపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా నేడు భారీ ర్యాలీ

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తే.. వాటిని శ్మశాన వాటికలుగా పోల్చుతూ దుర్మార్గపు వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ సోమవారం నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు పి.గన్నవరం అక్విడెక్టు దగ్గర రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై అంబాజీపేట మండలం ముక్కామల వరకూ జరుగుతుందని వివరించారు. పి.గన్నవరంలో ఆదివారం జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ఈ ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నిర్వహిస్తూ నెంబర్ వన్ స్థానంలో నిలిచిన జగన్‌ను చూసి.. చంద్రబాబు, దాని తోకపార్టీ, ఎల్లో మీడియా ఓర్వలేక పోతున్నాయని, జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, మండలశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, నాయకులు సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, సత్యమోహన్, మట్టపర్తి శ్రీనివాస్, నాగవరపు నాగరాజు, పినిశెట్టి శ్రీనివాసరావు, నాగాబత్తుల యువరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ



పి.గన్నవరంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు దివంగత అడ్డగళ్ల పుల్లారావు గ్రామానికి, రైతులకు అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆయన కుమారులు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అడ్డగళ్ల వెంకటసాయిరామ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు నానాజీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడ్డగళ్ల పుల్లారావు మెమోరియల్ ట్రస్టును ఆదివారం విప్పర్తి, కొండేటి ప్రారంభించారు. ట్రస్టు ఆధ్వర్యంలో వారు పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పుల్లారావు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు జక్కంపూడి తాతాజీ, మట్టా శైలజ, అడ్డగళ్ల శ్రీను, సాధనాల రమేష్, పుచ్చకాయల నర్సింహమూర్తి, నాగవరపు నాగరాజు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాతృ వియోగంతో బాధపడుతున్న పి.గన్నవరానికి చెందిన ఏపీ స్టేట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ కొండా నర్సింహారావును, అయన తండ్రి రామారావును జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మామిడికుదురు: లూటుకుర్రు శివారు బాడిలంకలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.68 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు నగరం ఎస్సై షేక్ జానీబాషా, రాజోలు ఎస్సై పృథ్వీ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడి చేసి జూదరులను అరెస్టు చేశారు.

ఈదురుగాలుల బీభత్సం



అలమూరులో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం



పాశర్లపూడి శివాలయంలో ఈదురుగాలులకు పడిపోయిన ధ్వజస్తంభం

మామిడికుదురు: వేడి గాలులు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బలమైన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఆకాశంలో దట్టమైన మేఘాలతో ఈదురు గాలులు వీశాయి. ఈదురు గాలుల ప్రభావానికి పాశర్లపూడి శివాలయం ప్రాంగణంలోని ధ్వజస్తంభం నేలకూలింది. అప్పనపల్లి మలుపులో మామిడిచెట్టుతో పాటు కొబ్బరిచెట్టు విరిగి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల బీభత్సంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భారీ వర్షం

ఆలమూరు: వాతావరణ పరిస్థితులు రోజుకో రీతిలో తరచూ విచిత్రమైన రీతిలో ఉంటున్నాయి. మండు వేసవిలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రోజు సాయంకాలం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఇటుకబట్టీల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో ఇంకా ధాన్యపు రాశులు కళ్లాల మీదనే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పి.గన్నవరం సీహెచ్‌సీ సమీపంలోని విద్యుత్ లైనుపై కొబ్బరిచెట్టు విరిగి పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయి ధ్వంసమైంది. నరేంద్రపురంలోని 33 కేవీ లైన్లపై కూడా కొబ్బరిచెట్లు పడటంతో మూడు చోట్ల వైర్లు తెగిపోయాయి. దీంతో ఏఈ ఆనందరాజు ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు.

17 విద్యుత్ స్తంభాల ధ్వంసం

అంబాజీపేట: మండలంలో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా వీచిన ఈదురుగాలులకు 17 విద్యుత్ స్తంభాలు ధ్వంసం కాగా, మూడు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ముక్కామలలో 2, ఇరుసుమండలో 3, చిరతపూడిలో 3, ఇసుకపూడిలో 2, వక్కలంకలో 1, గంగలకుర్రు అగ్రహారంలో 3, పుల్లేటికుర్రులో 2, మాచవరంలో 1 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. వీటితో పాటు రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. గంగలకుర్రు అగ్రహారం, అంబాజీపేట పీహెచ్‌సీల వద్ద ఉన్న రెండు భారీ వృక్షాలతో పాటు, ముక్కామలలో మరో వృక్షం నేలకొరిగింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ఏఈ ఎ.హరిబాబు తన సిబ్బందితో చర్యలు చేపట్టారు.

నేటి యువతకు రమణి ఆదర్శం

మామిడికుదురు: సివిల్స్‌లో విజేతగా నిలిచిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణి నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఈదరాడలో ఆదివారం ఎమ్మెల్యే చిట్టిబాబు సివిల్స్‌లో సత్తా చాటిన రమణిని కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్స్‌లో ప్రతిభ చూపడం ద్వారా కోనసీమ జిల్లాకు రమణి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, పార్టీ నేతలు యెరుబండి సూరిబాబు, వడ్డి ఆదిబాబు, చేట్ల సత్యనారాయణ, కుసుమ పెరుమాళ్లకుమార్, యెరుబండి రాముడు పాల్గొన్నారు. సివిల్స్‌లో ప్రతిభ చూపిన ఈదరాడకు చెందిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణిని రాజోలు తెలగా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అలాగే దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.శివప్రసాద్‌లు కూడాఅభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: పేదలకు ఏ కష్టం వచ్చిన తెలిసిన వెంటనే ఆదుకునే మనసున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ.12.71 లక్షల మేర ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సాయాన్ని ఆదివారం పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో చిట్టిబాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జగన్ సహకారంతో నియోజకవర్గంలో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2 కోట్ల మేర లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగన్‌ను అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, సర్పంచ్‌లు వడలి కొండయ్య, నూకపెయ్యి ప్రసన్నకుమార్, దంగేటి అన్నవరం, తోరం వీవీ సత్యనారాయణ, ఎంపీటీసీలు కొల్లే సూర్యనారాయణ, పులపర్తి రాజారావు, నాయకులు కుసుమ వెంకటేశ్వరరావు, కొల్లే శ్రీను తదితరులు పాల్గొన్నారు.